సాక్షి
పెద్దపల్లి
శనివారం । 28 । జూన్ । 2025



ఆర్జీ-2 ఏరియా సందర్శన

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాకు వచ్చిన నైవేలీ లిగ్నైట్ మాజీ డైరెక్టర్ మోహన్‌రెడ్డిని శుక్రవారం జీఎం వెంకటయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. ఎస్‌వోటూ జీఎం రాముడు తదితరులు ఉన్నారు.



జాతీయ పోటీల్లో సత్తాచాటాలి

గోదావరిఖని: జాతీయస్థాయి పోటీల్లో మహిళా రెస్క్యూ సభ్యులు సత్తాచాటాలని సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లు సూచించారు. మహిళా రెస్క్యూ సభ్యుల శిక్షణను పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో ఈడీ చందన్ కుమార్ సామంత

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పీటీఎస్‌లో శుక్రవారం జగన్నాథస్వామి రథయాత్ర సందడి మొదలైంది. వైకుంఠపురంలోని జగన్నాథుని ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జగన్నాథునిడి రథంలో పీటీఎస్ వీధులలో కోలాట బృందాల నృత్యాలతో ఊరేగించారు. ఆలయ అర్చకులు రామాచార్యులు, ఎన్టీపీసీ ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న అన్న ప్రసన్నకుమారి

పెద్దపల్లిరూరల్: గర్భస్థ శిశువు లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు పాటించని స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్నకుమారి హెచ్చరించారు. శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. లింగ నిర్ధారణ చేసినా, చేయించుకున్న వారికీ మూడేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తామన్నారు. జిల్లాలో 32 స్కానింగ్ కేంద్రాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌తో పాటు వాణిశ్రీ, స్రవంతి, శ్రీదేవి, స్నేహ పాల్గొన్నారు.

సీఈగా బాధ్యతలు స్వీకరణ



మాధవరావును అభినందిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: ఎన్పీడీసీఎల్ ఎస్ఈగా పని చేస్తున్న కంకటి మాధవరావుకు వరంగల్ జోన్ చీఫ్ ఇంజినీర్ (సీఈ)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈగా బాధ్యతలు చేపట్టిన మాధవరావును జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం పూలమాల, శాలువాతో సత్కరించారు.

బల్దియా ఇంజినీర్‌పై ఫిర్యాదు

కోల్‌సిటీ(రామగుండం): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బల్దియా ఈఈ పీవీ రామన్‌పై చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. టెండర్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం లేదని, స్థానికులను కాదని స్థానికేతర కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిన పనులు అప్పగిస్తున్నారని పేర్కొన్నారు. ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు టెండర్లు పిలిస్తే రామగుండంలో నామినేషన్ పద్ధతిలో అప్పగించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. చెట్లు కట్ చేయడం, ట్రీగార్డ్స్ సరఫరా చేయడానికి కూడా ఇలాంటి పద్ధతులు అమలు చేస్తున్నారన్నారు. స్థానిక కాంట్రాక్టర్లకు పనులు దక్కకుండా వ్యవహరిస్తున్న ఈఈపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. దీనిపై ఈఈ రామన్‌ను వివరణ కోరగా, కాంట్రాక్టర్లు చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. అన్ని పనులను టెండర్ల ద్వారానే అప్పగిస్తున్నామని తెలిపారు. బ్లీచింగ్ పౌడర్ సరఫరాను కలెక్టర్ అప్రోవల్‌తోనే అప్పగించామని వెల్లడించారు.

రేపు జిల్లాస్థాయి పోటీలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 29వ తేదీన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొలిపాక శ్రీనివాస్, కొమ్ము గట్టయ్య తెలిపారు. ప్రతిభ కనబర్చిన 20మందిని వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గలవారు వయసు ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డుతో అదేరోజు ఉదయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 96183 36976 నంబరులో సంప్రదించాలన్నారు.

3, 4వ తేదీల్లో కాలేజీల బంద్

పెద్దపల్లిరూరల్: విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్‌తో జూలై 3, 4వ తేదీల్లో డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ విద్యాసంస్థల బంద్ పాటిస్తున్నట్లు జాన్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేశ్ తెలిపారు. కాలేజీ యాజమాన్యాల తీరుతో విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేశ్, శివ, చరణ్, సాయి, శ్రీకాంత్, రాజు, మహేశ్, రాకేశ్ ఉన్నారు.

చిన్నబోతున్న చెరువు

- జిల్లాలో చేపపిల్లల పంపిణీపై నీలినీడలు
- పథకం అమలుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- నగదు అందజేస్తే తామే కొనుగోలు చేస్తామంటున్న మత్స్యకారులు
- సొసైటీలకు నిధులు విడుదల చేయాలని ప్రతిపాదనలు



సాక్షి,పెద్దపల్లి: మత్స్యకార్మికులకు ఆర్థిక స్వావలంబన చేకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ పథకంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వర్షకాలం ప్రారంభమై జూలై సమీపిస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత వెలువడలేదు. దీంతో అసలు ఈపథకం ఈ ఏడాది ఉంటుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూన్‌లోపే టెండర్ల ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంది. ఇప్పటివరకు ఎటువంటి కసరత్తు మొదలుపెట్టలేదు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయితే జూలై నుంచి సెప్టెంబర్ వరకు జలాశయాల్లో చేపలు, రొయ్య విత్తనాలను మత్స్యశాఖ అధికారులు సొసైటీల సహకారంతో వదలాల్సి ఉంది. అయితే, సకాలంలో చేప విత్తనాల్ని వదలకుంటే ఆశించిన మేర ఎదిగే అవకాశం ఉండదని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది మధ్యలోనే..

జిల్లాలో 281 మత్స్య సొసైటీలుండగా, అందులో 13,450 మంది సభ్యులు ఉన్నారు. గతేడాది అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి ప్రాజెక్టులతోపాటు 1,073 చెరువులు, 79 కుంటల్లో 31లక్షల చేపపిల్లలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందులో పెద్దసైజ్ (80 మి.మీ. నుంచి 100 మి.మీ.) చేపపిల్లలను రిజర్వాయర్లు, చిన్నసైజ్(35 మి.మీ. నుంచి 40 మి.మీ.) చేపపిల్లలను కుంటలు, చెరువుల్లో వదలాలని నిర్ణయించారు. టెండర్లు ఆలస్యంగా పిలవడం, టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు చిన్నసైజ్ చేపపిల్లలను సరఫరా చేస్తుండడంతో మత్స్యకారులు వాటిని అడ్డుకున్నారు. దీంతో మొత్తంగా గర్రెపల్లి, సుల్తానాబాద్‌లో 1.30లక్షల చేపపిల్లలు పంపిణీ చేసి ఆ తర్వాత మధ్యలోనే వదిలేశారు. ఉచిత చేపపిల్లలకు బదులు నగదు విడుదల చేస్తే సొసైటీలు నాణ్యమైన చేపపిల్లలు కొనుగోలు చేస్తాయని, వాటిద్వారా తమకు అందుతాయని మత్స్యకారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తద్వారా పిల్లల ఉత్పత్తి పెరుగుతుందని, తమ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని చెబుతున్నారు. అదనుదాటిన తర్వాత నిర్ణయం తీసుకోకుండా, అదనులోపే ప్రభుత్వం ఈపథకం అమలుపై స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా, చేపపిల్లల పంపిణీ ప్రక్రియలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలోనే ప్రభుత్వం పథకం అమలుపై ఆచూతూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. జిల్లామత్స్యకార అధికారి నరేశ్ నాయుడును ఈ విషయంపై వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు. ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సొసైటీలకు నగదు అందజేయాలి



ప్రభుత్వం చేపపిల్లలకు మత్స్యకార సొసైటీలకు నగదు ఇవ్వాలి. దీంతో మత్స్యకారులే నాణ్యమైన చేపపిల్లలు కొనుగోలు చేసుకుంటారు. ప్రభుత్వం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పజెప్పితే వారు నాణ్యతలేని, చిన్నసైజ్ పిల్లలను సరఫరా చేస్తున్నారు. దీంతో అవి ఎదగక ఆశించిన ఫలితం వస్తలేదు.

– గంధం వెంకటస్వామి, మత్స్యకారుడు

ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



చేపపిల్లల పంపిణీ పథకం అమలు చేస్తుందా? లేదా అనే విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఆలస్యంగా చేపపిల్లలు పంపిణీ చేస్తే సర్కారు లక్ష్యం నెరవేరదు. సకాలంలో పంపిణీ, సరఫరా చేయని కారణంగా ప్రైవేటుగా కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి చేపపిల్లలకు బదులు నగదు అందజేయాలి.

– గుండా రాజు, మత్స్యకారుడు

ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ సేవలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, మాతాశిశు సంరక్షణ కేంద్రంలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని, ఇందుకోసం మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ శ్రీహర్ష సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, ఎంసీహెచ్‌ను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. సమస్యలపై ఆరా తీశారు. బ్లడ్‌శాంపిల్ సేకరించే ల్యాబ్ వద్ద రద్దీ ఎక్కువగా ఉండడాన్ని గమనించారు. అవసరాన్ని బట్టి సెంటర్లను పెంచాలన్నారు. పేషెంట్లు కూర్చునేందుకు కుర్చీలు, కర్టెన్లు, ఇతర సామగ్రి కోసం ప్రతిపాదనలిస్తే నిధులు మంజూరు చేస్తానన్నారు. ఆహ్లాదకర వాతావరణం కోసం ఇండోర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సూపరింటెండెంట్ శ్రీధర్, ఆర్ఎంవో విజయ్ తదితరులు ఉన్నారు. అంతకుముందు సుభాష్ విగ్రహం వద్ద గల ఎంఈవో కార్యాలయాన్ని కలెక్టర్ శ్రీహర్ష సందర్శించారు. మండల రిసోర్స్ కేంద్రం పనితీరుపై ఆరా తీశారు.

సర్కారు బడుల పనితీరు మెరుగుపడాలి

ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగుపడాలని, సీఆర్పీలు విధులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో పాఠశాలల నిర్వహణపై సమీక్షించారు. ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ పారదర్శకంగా జరగాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగిన స్కూళ్లలో వసతులు మెరుగుపర్చాలని, అదనపు గదుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. వారంలో ఒకరోజు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు. జీసీడీవో కవిత, ఎస్‌వో మల్లేశ్, పీఎం షేక్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై ప్రచారం

ఇంటి కప్పుపై సోలార్ విద్యుత్ ప్యానెల్‌తో విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన పథకంపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోలార్‌శక్తిపై సమీక్షించారు. ప్రతీ మండలంలో కనీసం 500 ఇళ్లపై ఈ పథకం అమలయ్యేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. డీఆర్డీవో కాళిందిని, డీపీవో వీరబుచ్చయ్య తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి

జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో వనమహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధిహామీ పథకం పనులపై ఎబీపీడీవో, ఎంపీవో తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే విజయరమణారావు



పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ప్రజాసంక్షేమం, పారదర్శక పాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. జాఫర్‌ఖాన్‌పేట, పెద్దరాతుపల్లి, ఇదులాపూర్, ఎన్నంపల్లి గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పనులకు ముగ్గు పోశారు. జాఫర్‌ఖాన్‌పేట కొత్త గ్రామపంచాయతీ భవనం, పెద్దరాతుపల్లిలో పల్లెదవాఖా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళా శిశు సంక్షేమం, విద్య, వైద్యం, ఆరోగ్యంపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, రిటైర్డ్ హెచ్‌ఎం నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య తదితరులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న అంబులెన్స్‌లు

- అత్యవసర సమయాల్లో ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు
- ప్రైవేట్ వాహనాలే దిక్కవతున్న వైనం
- పట్టించుకోని సింగరేణి అధికారులు



గనిపై నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనులపై అందుబాటులోకి తీసుకొచ్చిన అంబులెన్స్‌లు ప్రచారానికే పరిమితం అవుతున్నాయి. అత్యవసర సమయాల్లో కార్మికులను ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన వాహనాలు వివిధ కారణాలతో మొరాయిస్తున్నాయి. ఆపదలో ఉన్న ఉద్యోగులు గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి చేర్చడం అత్యంత కీలకం. ఈక్రమంలో గురువారం జీడీకే–11గనిలో పనిచేస్తున్న ఉద్యోగురాలు చాతీ నొప్పితో అస్వస్థతకు గురైంది. దీంతో గనిపై ఉన్న అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించేందుకు సమాయత్తం చేయగా అది స్టార్ట్‌కాలేదు. దీంతో గనిపై ఉన్న ఓ బొలేరో వాహనంలో సింగరేణి ప్రధాన ఆస్పత్రికి తీసుకెళ్లారు. జేబీసీసీఐ ఒప్పందం ప్రకారం ప్రతీ మైన్‌పై అంబులెన్స్ అందుబాటులో ఉండాలని నిర్ణయించారు. అయితే గనిపై అంబులెన్స్ ఏర్పాటు చేసినప్పటికీ అది కండీషన్‌లో లేకపోవడంతో అవసరానికి ఉపయోగ పడడం లేదని, ఉద్యోగులు, కార్మికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

రెండు సంఘటనల్లో ఇబ్బందులు

ఆర్జీ–1 ఏరియా జీడీకే–11గనిలో ఈనెల 24న అండర్‌గ్రౌండ్ ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో గ్రూప్ ఇంజినీర్ రాందాస్ అస్వస్థకు గురయ్యారు. అత్యవసరంగా ఆయనను ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. గనిపై ఉన్న అంబులెన్స్ మొరాయించడంతో బొలేరో వాహనంలో బాధితుడిని సింగరేణి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈనెల 26న ఉదయం7గంటల షిఫ్ట్‌లో కంటిన్యూస్ మైనర్–2లో పనిచేస్తున్న మహిళా ట్రెయినీ ఫిట్టర్ చాతిలో నొప్పి వస్తుందని అధికారులకు చెప్పారు. ఆమెను వెంటనే అండర్ గ్రౌండ్ నుంచి గనిపైకి తీసుకొచ్చి అంబులెన్స్‌లో తరలించాలని ప్రయత్నించారు. ఆ సమయంలో వాహనం స్టార్ట్ కాలేదు. దీంతో బొలేరో వాహనంలో ఏరియా హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా హార్ట్ ఎటాక్‌లు ఎక్కువ అవుతున్నాయని, గనిపై అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు కోరాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కండీషన్‌లోనే ఉండాలి

కండీషన్‌లో ఉన్న అంబులెన్స్‌లను గనిపై ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు తుమ్మల రాజారెడ్డి, మెండె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అత్యవసర సమయాల్లో పనిచేయని అంబులెన్స్‌లు గనిపై ఉండి ఏం ప్రయోజనమని వారు ప్రశ్నించారు.

'రామగుండంలో విధ్వంస పాలన'



కూల్చివేల్చిన షాపులను పరిశీలిస్తున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో ప్రజాపాలన పేరుతో విధ్వంసం కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. ప్రధాన చౌరస్తా సమీపంలో కూల్చివేసిన షాపులను శుక్రవారం ఆయన పరిశీలించారు. సుందరీకరణ, అభివృద్ధి పేరిట చిరువ్యాపారుల దుకాణాలు తొలగిస్తూ జీవనోపాధిపై దెబ్బతీస్తున్నారన్నారు. పేదల జీవితాలను కాంగ్రెస్ పాలకులు రోడ్డున పడవేస్తున్నారని అన్నారు. రోడ్డు విస్తరణ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో షాపులను కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయం కల్పించిన స్థలంలోనే వేసుకున్న షెడ్లను మళ్లీ కూల్చివేయడం ఏమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపు ఐలయ్యయాదవ్, నారాయణదాసు మారుతి, జేవీ రాజు, కల్వచర్ల కృష్ణవేణి, ఐత శివకుమార్, బొడ్డుపల్లి శ్రీనివాస్, అచ్చె వేణు, తోట వేణు, బొబ్బిలి సతీశ్, దొమ్మేటి వాసు, సట్టు శ్రీనివాస్, కుమార్‌నాయక్ తదితరులు ఉన్నారు.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ



రాఘవాపూర్ రైల్వేస్టేషన్‌లో నిలిచిన రైళ్లు



క్లస్టర్‌కు మరమ్మతు చేస్తున్న రైల్వే సిబ్బంది



మరమ్మతు పనుల్లో నిగ్నమైన సిబ్బంది

- రైల్వేబ్రిడ్జి పనుల్లో విరిగిన 'క్లస్టర్'
- విద్యుత్ సరఫరా నిలిపివేత
- ఎక్కడికక్కడే ఆగిన రైళ్లు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారులోని పెద్దపల్లి – కూనారం మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద చేపట్టిన రైల్వే వంతెన నిర్మాణంలో శుక్రవారం అపశ్రుతి చోటుచేసుకుంది. గడ్డర్ ఏర్పాటు చేసేందుకు అమర్చిన క్లస్టర్ విరిగి అధికారులు, కార్మికులు ఆందోళనకు గురైనా.. వెంటనే అప్రమత్తమయ్యారు. తక్షణమే రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఆగమేఘాలపై విద్యుత్ సరఫరా నిలిపివేయించారు.

ఎక్కడిరైళ్లు అక్కడే..

కాజీపేట – బల్హార్ష సెక్షన్‌లో విద్యుత్ తీగలకు సరఫరా నిలిపివేయడంతో ఈ మార్గంలోని గూడ్స్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. రాఘవాపూర్ రైల్వేస్టేషన్‌లో భాగ్యనగర్, జమ్మికుంటలో తెలంగాణ, ఉప్పల్‌లో ఇంటర్‌సిటీ, కొలనూర్‌లో అనువ్రత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. గంటలకొద్దీ రైళ్లు నిలిచిపోవడంతో గమ్యస్థానాలు చేరుకునేందుకు ప్రయాణికులు నానాఇబ్బందులు పడ్డారు. అత్యవసరమైనవారు సమీపంలోని రోడ్లపైకి చేరి బస్సులు, ఇతర వాహనాలను ఆశ్రయించారు.

శరవేగంగా పనులు..

రైల్వేవంతెన వద్ద గడ్డర్‌కు అమర్చిన క్లస్టర్ విరిగిపోవడంతో ఇతర పరికరాల సాయంతో దానిని తొలగించి మరో క్లస్టర్ అమర్చారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో మధ్యాహ్నం నుంచి రైళ్లరాకపోకలు యథావిధిగా కొనసాగాయి. పనులు సాగుతుండగానే డౌన్‌లైన్(కాజీపేట వైపు) ఉదయం 11.30 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించి రైళ్లను నడిపించారు. అప్ (బల్హార్షా వైపు) మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో రైళ్ల రాకపోకలు ప్రారంభించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు

బల్హార్ష, కాగజ్‌నగర్ నుంచి ఉదయం సికింద్రాబాద్ వెళ్లేందుకు భాగ్యనగర్ రైలు ఒక్కటే ఉంది. వివిధ పనుల కోసం అత్యధిక మంది ఈ రైలులోనే ప్రయాణిస్తారు. అయితే, రాఘవాపూర్ రైల్వే స్టేషన్‌లో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. పనులు ఎప్పటికి పూర్తవుతాయో, రైలు ఎప్పుడు కదులుతుందోననే దానిపై స్పష్టత లేక ఆందోళనకు గురయ్యారు.

ఇంటికే వెళ్తున్న



హైద్రాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు భాగ్యనగర్ రైలులో ప్రయాణించాల్సి ఉంది. ఇందుకోసం ఉదయం ఐదున్నర గంటలకే రైల్వేస్టేషన్‌కు చేరుకుని టికెట్ తీసుకున్న. రైలు ఎంతకూ రాలేదు. ఉదయం 10 గంటల దాకా వేచిచూసి ఇక ఇంటికే వెళుతున్న. రైలు నడవకున్నా టికెట్ డబ్బులు వాపస్ ఇవ్వలేదు.

– ముస్తఫా, అప్పన్నపేట

నిరీక్షణ తప్పలేదు



ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించేందుకు వచ్చా. కానీ.. కూనారం వంతెన వద్ద జరిగిన ఘటనతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగిందని తెలిసింది. రైలు వచ్చేదాకా రైల్వే స్టేషన్‌లోనే నిరీక్షించాల్సి వస్తోంది.

– శ్రీకాంత్, ప్రయాణికుడు

టిఫిన్ కోసం వెళ్తే..



కాజీపేట వెళ్లేందుకు భాగ్యనగర్ రైలు ఎక్కా. రాఘవాపూర్‌లో నిలిపివేశారు. దాదాపు రెండుగంటల పాటు నిరీక్షించా. అధికారులను అడిగితే ఇంకా నాలుగైదు గంటలు పట్టొచ్చన్నారు. టిఫిన్ చేసేందుకు రోడ్డుపైకి వచ్చి వెళ్లేసరికి రైలు పెద్దపల్లికి వెళ్లిపోయింది. అక్కడకు చేరుకునేసరికి రైలు అక్కడనుంచి వెళ్లిపోయింది. బస్సు ప్రయాణమే దిక్కయింది.

– శ్రీనివాస్, రామకృష్ణాపూర్

పర్యవేక్షణ లోపమే..



పెద్దపల్లి–కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తే ఇలాంటి తప్పిదాలకు అవకాశం ఉండదు. పనుల్లో నిర్లక్ష్యంతోనే సమస్య తలెత్తింది. ఇది రైళ్ల రాకపోకలు, అందులో ప్రయాణించే వారిపై తీవ్ర ప్రభావం చూపింది. ఇలాంటి తప్పిదాలు భవిష్యత్‌లో జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– నారాయణదాస్ తివారీ, డీఆర్‌యూసీసీ సభ్యుడు

అంగన్‌వాడీలు మరింత బలోపేతం

- వారంలో రెండ్రోజులు ఎగ్‌బిర్యానీ
- జిల్లాలో 41 వేల మందికి లబ్ధి



ఎగ్ బిర్యానీ తింటున్న చిన్నారులు

జిల్లా సమాచారం

టీచర్లు	ఆయాలు	గర్భిణులు	బాలింతలు
706	706	3,737	2,932

ఏడాదిలోపు పిల్లలు 17,382	మూడు నుంచి ఆరేళ్లలోపువారు 15,744

సుల్తానాబాద్(పెద్దపల్లి): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ఎగ్‌బిర్యానీ అందిస్తోంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నివారణ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాల సంఖ్య పెంపు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు ఇప్పటికే రోజూ కోడిగుడ్డుతో భోజనం పెడుతున్న ప్రభుత్వం.. మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం అందిస్తోంది. నెలకు 16 కోడిగుడ్లు ఇంటింటా పంపిణీ చేస్తోంది. తినే స్థాయిగల వారికి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉడకబెట్టి అందిస్తోంది. పప్పుతో కూడిన భోజనాన్ని పిల్లలు ఇష్టపడడం లేదని గుర్తించిన సర్కారు.. తాజాగా మెనూ మార్చింది. ఈనెల 10 నుంచి జిల్లాలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో వారంలో రెండ్రోజులు ఎగ్ బిర్యానీ అందించేలా అధికారులు కార్యాచరణ అమలు చేస్తున్నారు.

41,207 వేల మందికి ప్రయోజనం..

జిల్లాలో 706 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇందులో సిబ్బంది సహా చిన్నారులు, బాలింతలు, గర్భిణులు 41,207 మంది ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. వీరందరికీ పౌష్టికాహారం అందించడానికి వారంలో రెండ్రో జులు ఎగ్ బిర్యానీ అందిస్తోంది. పిల్లల ఎదుగుదలతో పాటు గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారనేది ప్రభుత్వ లక్ష్యమని అంటున్నారు.

పది నుంచి అమలు చేస్తున్నాం



జిల్లాలోని మూడు సీడీపీవో కార్యాలయాల పరిధిలో ఈనెల 10 నుంచి ఎగ్ బిర్యానీ అందిస్తున్నాం. పిల్లలను పటిష్టంగా తయారు చేయడంతోపాటు వారి సంఖ్య పెంచడం లక్ష్యం. బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం.

– వేణుగోపాల్, డీడబ్ల్యూవో

క్లుప్తంగా

రాజన్నకు ఆషాఢపూజలు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్వామి వారి హుండీలలో వేసిన కట్నాలు, కానుకలను జూలై 1న ఓపెన్ స్లాబ్‌లో లెక్కించనున్నట్లు ఈవో రాధాభాయి తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

అంజన్న సన్నిధిలో ఫోరెన్సిక్ డైరెక్టర్ పూజలు



అంజన్న సన్నిధిలో ఫోరెన్సిక్ డైరెక్టర్ కుటుంబ సభ్యులు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ దనూజ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఏఎస్సై శ్రీనివాస్, పాల్గొన్నారు.

యాదగిరి గుట్టకు ప్రత్యేక బస్సు



బస్సును ప్రారంభిస్తున్న డీఎం కల్పన

జగిత్యాలటౌన్: యాదగిరి గుట్ట తదితర ఆలయాల దర్శనం కోసం జగిత్యాల నుంచి ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు జగిత్యాల డిపో మేనేజర్ కల్పన అన్నారు. శుక్రవారం ఆలయాల కోసం కేటాయించిన ప్రత్యేక బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఉదయం 5గంటలకు జగిత్యాల నుంచి బయలు దేరిన ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు కొండగట్టు, వేములవాడ, కొమురవెల్లి, స్వర్ణగిరి మీదుగా యాదగిరిగుట్టకు చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.880, పిల్లలకు రూ.450 చార్జి ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆమె కోరారు.

దాడి చేసుకున్న హిజ్రాలు

- భయభ్రాంతులకు గురైన స్థానికులు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్‌లో గురువారం రాత్రి హిజ్రాలు ఒకరిపై ఒకరు దాడికి దిగడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురై పరుగులు పెట్టారు. జగిత్యాల జిల్లాకు చెందిన హిజ్రాలు పాత బస్టాండ్ ప్రాంతంలో తిరుగుతుండగా సిద్దిపేట జిల్లాకు చెందిన మరికొంత మంది హిజ్రాలు పాతబస్టాండ్‌కు చేరుకున్నారు. దీంతో తమ అనుమతి లేకుండా తమ జిల్లాకు ఎందుకు వచ్చారంటూ రెండు వర్గాల వారు వాగ్వాదానికి దిగారు. ఇంతలో రెచ్చిపోయిన హిజ్రాలు ఒకరిపై ఒకరు దాడికి దిగడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురై పరుగులు పెట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు హిజ్రాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214 [H-783418]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

ఓపెన్ చదువు.. భవితకు వెలుగు

- దూరవిద్యలో పది, ఇంటర్ చదివేందుకు అవకాశం
- ప్రవేశాలకు ఆగస్టు 12వ తేదీ వరకు గడువు



ఓపెన్‌స్కూల్ క్లాసులు వింటున్న అభ్యర్థులు (ఫైల్)

కరీంనగర్: డ్రైవింగ్ లైసెన్సు పొందాలన్నా, ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందాలన్నా కనీసం పదోతరగతి ఉత్తీర్ణత అడుగుతున్నారు. నాడు కొన్ని కారణాలతో చదువు మధ్యలో ఆపేసినవారికి ప్రభుత్వం సార్వత్రిక విధానం(దూరవిద్య)ద్వారా చదివేందుకు అవకాశం కల్పిస్తోంది. పదోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు ప్రారంభం అయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదోతరగతి కోసం 32సెంటర్లు, ఇంటర్ కోసం 24సెంటర్లు ఏర్పాటు చేశారు. 2024–25లో నిర్వహించిన పదోతరగతి పరీక్షల్లో 1,006 మంది, ఇంటర్‌లో 1,920మంది పాసయ్యారు. దూరవిద్య ద్వారా ఎస్ఎస్‌సీ, ఇంటర్ చదివే అవకాశం ఉన్నా చాలా మందికి అవగాహన లేక దూరంగా ఉంటున్నారు. ఇందులో ఉత్తీర్ణులైనవారికి సార్వత్రిక విద్యాపీఠం వారు సర్టిఫికెట్లు అందజేస్తారు. ఇవి సాధారణ విద్యార్థులకిచ్చే సర్టిఫికెట్ల మాదిరిగానే పనిచేస్తాయి. 2025–26 విద్యాసంవత్సరానికి అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

పదోతరగతిలో ప్రవేశాలకు..

సార్వత్రిక విద్యను అభ్యసించేందుకు 14ఏళ్ల నుంచి 50ఏళ్లు ఉన్న వారందరికీ అవకాశం కల్పిస్తారు. పదోతరగతిలో ఎలాంటి విద్యార్హత లేకున్నా ప్రవేశం పొందవచ్చు. వయస్సు నిర్ధారణకు తహసీల్దార్ లేదా మున్సిపాలిటీ అధికారులు జారీ చేసిన ధ్రువపత్రాలు ఉండాలి. గతంలో ప్రాథమిక పాఠశాలలో చేరిన వారు మధ్యలో బడి మానేస్తే టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రెండు పాస్ ఫొటోలతో ప్రవేశాలు పొందవచ్చు. ఓసీ కేటగిరికీ చెందిన పురుషులు రూ.1,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మాజీ సైనికోద్యోగుల పిల్లలు, వికలాంగులు, మహిళలు రూ.600 రుసుం చెల్లించాలి. వీటితో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చెల్లించాలి.

ఇంటర్‌లో చేరాలంటే

ఇంటర్ అడ్మిషన్‌కు 15ఏళ్ల వయస్సు కలిగి పదోతరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. పదోతరగతి ఒరిజినల్ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రెండు పాస్ ఫొటోలతో ప్రవేశం పొందవచ్చు. సైన్సు గ్రూపులు సైతం అందుబాటులో ఉన్నాయి. ఓసీ కేటగిరి పురుషులకు ప్రవేశ రుసుం రూ.1,100, రిజర్వేషన్ వర్తించే వారు రూ.800 చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 ఉంటుంది. స్టడీ సెంటర్లలో ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. మధ్యవర్తులను కానీ, దళారులను కానీ ఆశ్రయించకూడదని అధికారులు చెబుతున్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ ప్రవేశాలు పొందేందుకు మీసేవ ఆన్‌లైన్ రశీదు జత చేసి ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ పరిశీలనకు నిర్ణీత సమయంలో పంపించాల్సి ఉంటుంది. డీఈవోతో నియమించబడిన అడ్మిషన్ కమిటీ దరఖాస్తు ఫారాలను పరిశీలించి ప్రవేశాన్ని నిర్ధారణ చేయనున్నారు. ఓపెన్ విద్యకు సంబంధించి సందేహాలు ఉంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు సెల్ నంబరు 8309212661ను సంప్రదించాలని జిల్లా విద్యాధికారులు వెల్లడించారు.

సద్వినియోగం చేసుకోండి



చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ విద్య వరం. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత సార్వత్రిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి. 2025–26 విద్యా సంవత్సరానికి పది, ఇంటర్ తరగతుల నిర్వహణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న తరువాత తప్పనిసరిగా దరఖాస్తు, అవసరమైన డాక్యుమెంట్లను సంబంధిత ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో అందజేయాలి.

– శ్రీరామ్ మొండయ్య, డీఈవో

చివరి దశకు ఎంపిక పోటీలు

- జూలై 1 నుంచి హకీంపేట క్రీడాపాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలు
- ఎంపికైతే 4వతరగతిలో ప్రవేశం



పెద్దపల్లిలో జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో షటిల్ రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడాపాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో 4వతరగతిలో ప్రవేశాలకు గాను ఎంపిక పోటీల ప్రక్రియ చివరి దశకు చేరుకున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈనెల 25, 26ల్లో జిల్లాస్థాయిలో ఎంపిక ప్రక్రియను ఆయా జిల్లా క్రీడాశాఖ అధికారులు పూర్తి చేశారు. జిల్లాస్థాయిలో రాణించిన విద్యార్థులను రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు ఎంపిక చేశారు. జూలై 1 నుంచి 5 వరకు హకీంపేటలోని క్రీడాపాఠశాలలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లా విద్యార్థులకు జూలై 1, 2ల్లో ఎంపిక పోటీలు జరగనున్నాయి. సికింద్రాబాద్‌లోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో స్పోర్ట్స్ స్కూళ్లుండగా.. 2025–26 విద్యాసంవత్సరానికి గాను 4వతరగతిలో ప్రవేశం కల్పిస్తారు. మొత్తం 60 మంది బాలురు, 60 మంది బాలికలకు ప్రవేశం దక్కనుంది.

రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల వివరాలు

కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల విద్యార్థులు జూలై 1 మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు రిపోర్టు చేయాలి. 2న ఆంత్రోపోమెట్రిక్, మోటార్ క్వాలిటీ, మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. పెద్దపల్లి జిల్లా విద్యార్థులు జూన్ 30న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు రిపోర్టు చేయాలి. జూలై 1న ఆంత్రోపోమెట్రిక్, మోటార్ క్వాలిటీ, మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు నిర్వహించే ఆంత్రోపోమెట్రిక్ పరీక్షలు ఎత్తు, బరువు. రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు నిర్వహించే మోటార్ క్వాలిటీ పరీక్షలు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 6.10మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్ వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ పరీక్ష, మెడిసన్ బాల్‌త్రో(కిలో), 800 మీటర్ల రన్నింగ్ మొత్తం 9 పరీక్షలు నిర్వహిస్తారు. ఒక్కో పరీక్షకు 3 పాయింట్లు మొత్తం 27 పాయింట్లుంటాయి. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా పాయింట్లిస్తారు. ఆధార్ కార్డు ఒరిజినల్, 4వతరగతి చదువుతున్నట్లు స్కూల్ వారిచ్చిన సర్టిఫికెట్, వయస్సు ధ్రువీకరణ పత్రం, 3వతరగతి ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్, 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు ఎంపికైన విద్యార్థులు తీసుకెళ్లాలి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం హకీంపేటలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడాపాఠశాలలో రాష్ట్రస్థాయి క్రీడాపాఠశాల ఎంపిక పోటీలు జరుగుతాయి. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ పాఠశాలల్లో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు అవకాశం కల్పిస్తారు.

సత్తా చాటాలి



రాష్ట్రస్థాయి క్రీడాపాఠశాల ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తా చాటాలి. 4వతరగతిలో అన్ని క్రీడాపాఠశాలల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులే సీట్లు సంపాదించాలి. తెలంగాణలో క్రీడల్లో ఉమ్మడి జిల్లాకు ఘనమైన చరిత్ర ఉంది. క్రీడల్లో రాణించినవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. అది క్రీడాపాఠశాలతోనే సాధ్యమవుతుంది.

– తుమ్మల రమేశ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు

20కి పైగా సాధించాలి



రాష్ట్రస్థాయి ఎంపికలో 9 కేటగిరీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. అన్ని ఈవెంట్లలో మంచి స్కోరింగ్ సాధించాలి. మెడిసిన్ బాల్‌త్రో, షటిల్ రన్, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో స్కోరింగ్ ఎక్కువగా చేయొచ్చు. మొత్తం 27 పాయింట్లకు గాను 20 పాయింట్లకు పైగా స్కోరింగ్ చేస్తే సీటు సంపాదించొచ్చు.

– నాగిరెడ్డి సిద్దారెడ్డి, శాట్స్ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్

పది నిమిషాల్లో ఇంటి వద్ద ఉంటా

- కుటుంబ సభ్యులతో మాట్లాడి..
- ఆ వెంటనే రోడ్డు ప్రమాదం
- ఢీకొన్న గుర్తుతెలియని వాహనం
- ఇద్దరు యువకుల దుర్మరణం
- అప్పన్నపేట వద్ద ఘటన



చిలుకల చక్రి (ఫైల్)



సోగాల శ్యామ్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున (గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత) గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. పెద్దపల్లి రూరల్ ఎస్సై మల్లేశ్ కథనం ప్రకారం.. జిల్లాలోని గోదావరిఖని ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన చిలుకల చక్రి(24) సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తన మిత్రుడు తిలక్‌నగర్‌కు చెందిన సోగాల శ్యామ్ (22)తో కలిసి పెద్దపల్లి నుంచి గోదావరిఖనికి బైక్‌పై వెళ్తున్నారు. ఈక్రమంలో అప్పన్నపేట వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. అయితే, స్నేహితుడి వద్దకు వెళ్లొస్తామంటూ చెప్పి బయల్దేరిన కొడుకు ఇలా శవమై కనిపిస్తాడనుకోలేదంటూ మృతుల కుటుంబీకులు రోదిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. ఇంకా ఇంటికి రాలేదేంటని ఫోన్‌చేస్తే.. పదినిమిషాల్లో ఇంటికాడ ఉంటా.. అని చెప్పిన తన కుమారుడు కని పించకుండా పోయాడని చిలుకల చక్రి తండ్రి వినోద్ విలపించాడు. సింగరేణి గెస్ట్‌హౌస్‌లో పనిచేస్తు న్న చక్రికి భార్య, ఏడాది వయసున్న కుమారుడు ఉండగా, శ్యాం అవివాహితుడు. మృతదేహాలకు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. ప్రమాదస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తి మృతి



ఆదిత్య (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం తాటిపల్లి శివారులో జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో జగిత్యాల ఉప్పరిపేటకు చెందిన కట్ట ఆదిత్య (19) మృతి చెందగా, తాటిపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఉప్పరిపేటకు చెందిన ఆదిత్య గురువారం పనినిమిత్తం ద్విచక్రవాహనంపై మేడిపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా తాటిపల్లి వద్ద మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, ఆదిత్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదిత్యకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాస్‌కు కాలు విరగడంతో పాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- భయాందోళనకు గురైన స్థానికులు
- కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు

గోదావరిఖని: మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. బర్త్‌డే పార్టీ చేసుకుని అతిగా మద్యం తాగారు. రోడ్డుపైనే గొడవకు దిగారు. ఈక్రమంలో వాగ్వావాదం పెరిగి గొడవకు దారితీసింది. అతిగా మద్యం తాగిన ఓ యువకుడు కత్తితో దూసుకొచ్చినట్లుగా చెబుతున్నా.. హాక్‌సా బ్లేడ్‌తో దాడికి యత్నించినట్లు పోలీసులు అంటున్నారు. ఈసంఘటనతో స్థానికులు భయాందోళనకు గురైయ్యారు. గొడవ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బర్త్‌డే పార్టీ పేరుతో హల్చల్ చేసి, గొడవకు దిగిన యువకులను అదుపులోకి తీసుకున్నారు.

యువకుల బైండోవర్..

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి విఠల్‌నగర్‌లో ప్రజాజీవనానికి భంగం కలిగించేలా ప్రవర్తించిన కొందరిని అదుపులోకి తీసుకుని శుక్రవారం బైండోవర్ చేసినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. ఎస్సై రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



శ్రీకర్

ఇబ్రహీంపట్నం: పాఠశాలకు వెళ్తున్న అని చెప్పి ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం మూలరాంపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి కందుకురి శ్రీధర్, వనితల కుమారుడు కందుకురి శ్రీకర్ (15) మండలంలోని వేములకుర్తిలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో తల్లిదండ్రులకు పాఠశాలకు వెళ్తున్న అని చెప్పి బయలుదేరాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువులను, స్నేహితులను ఆరా తీయగా ఎక్కడ కనిపించలేదు. ఈవిషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిస్తే శ్రీకర్ తండ్రి సెల్ 9133241459, తల్లి వనిత 9701190360లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆత్మీయ సమావేశం



కళాశాల మొట్టమొదటి ప్రిన్సిపాల్ కొండాల్‌రావుతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఇతర ప్రముఖులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఎస్‌కే ఎన్ఆర్ కళాశాల ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కళాశాల మొట్టమొదటి ప్రిన్సిపాల్ వెలిశాల కొండాల్‌రావు శుక్రవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. అప్పటి విద్యార్థులు హాజరై ప్రిన్సిపల్‌తో కలిసి వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ వైస్‌చాన్స్‌లర్ వీరారెడ్డి, తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ భూమయ్య, మాజీ ఎమ్మెల్సీ కమలాకర్‌తో పాటు, మాజీమంత్రులు రాజేశంగౌడ్, ఎల్.రమణ, సుద్దాల దేవయ్య ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ఎంతో గొప్పదని, మాజీ ప్రధానమంత్రి పీవీ.నర్సింహారావు సహకారంతో మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనర్సింహారావు చొరవతో ఎంతో అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయని తెలిపారు.

ఉరేసుకుని ఎస్సారెస్పీ ఉద్యోగి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ శివారులోని లింగంపేటలో తులసీనగర్‌కు చెందిన కండ్లపల్లి ధర్మయ్య (61) ఎస్సారెస్పీ లష్కర్ ఉద్యోగి శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ధర్మయ్య కొన్ని రోజులుగా నరాల వ్యాధితో పాటు, ఇతర వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మనస్థాపానికి గురై శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు రాసిన సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, అనారోగ్య కారణాలతోనే తీవ్ర ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకుంటున్నానని, నన్ను క్షమించండి అంటూ లేఖ రాశాడు. దీంతో లేఖను చూసిన కుటుంబ సభ్యులు తీవ్రంగా రోధించారు. కాగా, మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

మూడు రోజుల్లో ఉద్యోగ విరమణ

జగిత్యాల ఎస్సారెస్పీ కార్యాలయంలో లష్కర్‌గా పనిచేస్తున్న ధర్మయ్య ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈనేపథ్యంలోనే తీవ్ర అనారోగ్య బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకోవడంతో ఎస్సారెస్పీ ఉద్యోగులంతా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సీఐల బదిలీలు

కరీంనగర్‌క్రైం: ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా పలువురు సీఐలు బదిలీ అయ్యారు. జమ్మికుంట రూరల్ సీఐగా కె.లక్ష్మీనారాయణను నియమించారు. అక్కడ పనిచేసిన కె.కిషోర్‌ను ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న ఆర్.ప్రకాశ్‌గౌడ్‌ను కరీంనగర్ సీసీఎస్‌కు, పి.రాజేంద్రప్రాద్‌ను ఎస్‌బీ రామగుండంకు, వై.కృష్ణారెడ్డిని సీసీఎస్ రామగుండంకు బదిలీ చేశారు.

దొంగలిస్తూ.. విక్రయిస్తూ

- ఆరుగురు బైక్ దొంగల అరెస్టు
- 33 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం



వివరాలు వెల్లడిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి 33 బైకులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ సీపీ గౌస్‌ఆలం శుక్రవారం కమిషనరేట్ కేంద్రంలో వివరాలు వెల్లడించారు. సీపీ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా వెంకిచర్లకు చెందిన పంతుల నవీన్(24), కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చొక్కరావుపల్లికి చెందిన పెంటి బాలు (24), గంగాధర మండలం లింగంపల్లికి చెందిన తోట మధు(28), రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాలకు చెందిన పెద్ది నాగరాజు(29), ఇల్లంతకుంటకు చెందిన కుంబాల సురేశ్(35), మంథని మండలం కేశనపల్లికి చెందిన సాయిప్రసాద్(24) ముఠాగా ఏర్పడ్డారు. కొన్నేళ్లుగా వివిధ ప్రదేశాల్లో పార్కింగ్ చేసిన బైక్‌ను చోరీ చేస్తున్నారు. వీరిలో ఇద్దరు బైక్ దొంగిలిస్తే.. మిగితావారు విక్రయించి, అందరూ డబ్బులు పంచుకుంటారు. కొన్నేళ్లుగా కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 11బైక్‌లు, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9బైక్‌లు, త్రీటౌన్ స్టేషన్ పరిధిలో ఒకబైక్, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండుబైక్‌లు, కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు బైక్‌లు, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు, వివరాలు లేని ఐదు బైకులు దొంగిలించారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పద్మనగర్ చౌరస్తా వద్ద టూటౌన్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. రెండు ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న ఆరుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. కరీంనగర్ కమిషనరేట్, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో రూ.12,27,000 విలువైన 33బైకులు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టూ టౌన్ సీఐ సృజన్‌రెడ్డి, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ కోటేశ్వర్, త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డిని సీపీ అభినందించారు.

డాక్టర్ భూంరెడ్డికి పద్మశ్రీ ఇవ్వాలి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



డాక్టర్ భూంరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కరీంనగర్: తెలంగాణలోనే మొట్టమొదటి జనరల్ సర్జన్, కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు భూంరెడ్డికి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో శుక్రవారం పర్యటించారు. ముందుగా జాగృతి నాయకులు జాడి శ్రీనివాస్ నివాసానికి వెళ్లి బీసీ సంఘాల నాయకులు, జాగృతి సభ్యులను కలిశారు. డాక్టర్ భూంరెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్ ఇటీవల మరణించగా ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. డాక్టర్ భూంరెడ్డి నివాసంలో ఆయన కుటుంబ సభ్యులు సూర్యనారాయణరెడ్డి, సుధ, రామ, రవీందర్‌రెడ్డితో మాట్లాడారు. దేశ మొదటి ప్రధాని నెహ్రూకు ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స చేసిన డాక్టర్ భూంరెడ్డి విదేశాలకు వెళ్లే అవకాశాలు వచ్చినా వదులుకొని కరీంనగర్‌లో వైద్యసేవలు అందించారని గుర్తు చేశారు. ఆయనను పేదల డాక్టర్ అంటారని తెలిపారు. భూంరెడ్డికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించుకోవాలన్నారు. జగిత్యాల మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, జాగృతి నాయకులు జాడి శ్రీనివాస్, తానిపర్తి తిరుపతిరావు పాల్గొన్నారు.

దేదీప్యమానంగా కొలనూరు పాఠశాల

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్



నలిమెల భాస్కర్‌ను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

ఓదెల(పెద్దపల్లి): 'నా వయసు 23 ఏళ్లు ఉన్నప్పుడు కొలనూరు పాఠశాలకు ఉపాధ్యాయుడిగా వచ్చా. 14 భాషాలు నేర్చుకున్న. వివాహం చేసుకున్న. ఇప్పటికీ పాఠశాల దేదీప్యమానంగా ఉంది' అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కాళోజీ సాహిత్య పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్ ప్రశంసించారు. ఓదెల మండలం కొలనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మన ఊరు.. మనబడి వేదికలో పూర్వ విద్యార్థులు సన్మాన మహోత్సవం నిర్వహించారు. నలిమెల భాస్కర్ మాట్లాడుతూ, కొలనూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే చదువుకున్నానని చెప్పారు. ప్రపంచంలో అతిసులువైనది చదువు అని, దానికికోసం విద్యార్థులు శ్రమించాలన్నారు. ఇక్కడి ఉపాధ్యాయులు, అప్పటి విద్యార్థులు, గ్రామస్తులు అందరూ తనకు ఆత్మీయులేనన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న వారు ప్రస్తుతం పెద్ద హోదాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నతానియల్, బాసిక్స్ సీఈవో దేవరకొండ సత్యనారాయణ, ఎంఈవో రమేశ్, ప్రధానోపాధ్యాయుడు ఏసుదాసు, మాజీ సర్పంచ్ సామ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యా సంవత్సరం.. కొత్త బంగారు లోకం

- అనేక ఆలోచనలతో ఇంటర్‌లో ప్రవేశాలు



సుల్తానాబాద్(పెద్దపల్లి): కొత్త విద్యా సంవత్సరం ఈనెల 12న ప్రారంభమైంది. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్‌లో ప్రవేశాలు తీసుకుంటున్నారు. పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, అగ్రికల్చర్, బీఈడీ తదితర కోర్సుల్లోనూ అడ్మిషన్ తీసుకుంటున్నారు. మరికొందరు హాస్టల్లోనూ చేరుతున్నారు. ఇంకొందరు స్నేహితులతో కలిసి గదులు అద్దెకు తీసుకుని వివిధ కళాశాలలకు వెళ్తున్నారు. పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల విద్యార్థులు కొందరు బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటి దాకా అమ్మానాన్నతో గడిపిన విద్యార్థులు.. ఇక బ్యాచ్‌లర్‌గా జీవితం గడిపేందుకు సన్నద్ధమయ్యారు. ఇలాంటి వారికి గదులు అద్దెకు ఇచ్చేందుకు ఇళ్ల యజమానులు సుముఖత చూపడంలేదు.

కుటుంబం పరిస్థితితో అడుగులు వేయాలి

కోర్సులు చేరిన వారు ఎవరైనా.. ఏ కోర్సులో ప్రవేశం పొందాలన్నా.. ట్యూషన్ ఫీజులు, బుక్స్, ప్యాకెట్ మనీ, హాస్టల్ బిల్లులు, ప్రైవేట్ గదుల అద్దె చెల్లించడం తదితర వాటికి కుటుంబం ఆదాయంపైనే ఆధారపడాల్సి ఉంటుంది. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి చూసి విద్యార్థులు నడుచుకోవాల్సి ఉంటుంది. కొందరు కుటుంబ ఆర్థిక పరిస్థితులు చూసి పార్ట్‌టైం జాబ్ చేసేందుకు ముందుకు వస్తున్నారు. మరికొందరు ట్యూషన్ చెప్పేందుకు వెళ్తున్నారు.

పేరు తీసుకొస్తా

తల్లిదండ్రులు, కళాశాలకు మంచిపేరు తీసుకురావడానికి శ్రమిస్తా. కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నా ఆలోచన. అందుకే బాగాచదువుతా.

– స్వాతి, ఇంటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సుల్తానాబాద్

ఆలోచన సరళి మారాలి

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల ఆలోచన సరళి మారుతుంది. కష్టపడి చదివితేనే ఉజ్వల్ భవిష్యత్ ఉంటుంది. చదివే సమయంలో చదవాలి. ఆడే సమయంలోఆటలు ఆడాలి. అప్పుడే ప్రయోజకులు అవుతారు.

– శ్రీధర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సుల్తానాబాద్